సాక్షి విశాఖపట్నం

మంగళవారం ׀ 13 ׀ ఫిబ్రవరి ׀ 2024



పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు

ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ దివ్యాంగులకు సౌకర్యవంతంగా ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్న ఎన్నికల అధికారి తెలిపారు. 8లో



అర్జీలకు సత్వర పరిష్కారం

జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసీ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. 8లో



వీఎల్‌టీ ప్యానెల్ పునరుద్ధరణ

హెచ్ఎస్ఎల్‌లో 440 వీఎల్‌టీ ప్యానెల్‌ను పునరుద్ధరించారు. షిప్‌యార్డ్ సీఎండీ కమోడోర్ హేమంత్ ఖత్రి దీనిని ప్రారంభించారు. 8లో

న్యూస్‌రీల్

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్



స్టాళ్లను పరిశీలిస్తున్న కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ సాల్మన్ ఆరోక్యారాజ్

మల్కాపురం : రానున్న 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశాల చెంతకు చేరుతుందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ స్మాలన్ ఆరోక్యారాజ్ అన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని మల్కాపురం,మరడిమాంబ కళ్యాణ మండపం వద్ద వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి నిరుపేద కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. ప్రపంచంలో 5వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం రానున్న కాలంలో 3వ ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందన్నారు. దేశంలో రెండు కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేయడమే సంకల్ప యాత్ర ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా అక్కడ మహిళలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సెక్రటరీ సురేంద్రమోహన్, జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, జోన్-5 జెడ్సీ ఆర్.జి.కృష్ణ, జిల్లా మలేరియా అండ్ హెల్త్ ఆఫీసర్ డి.జగదీశ్వరరావు, స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్, ఆస్ట్రేలియా తెలుగుమల్లి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు,హిందీ,ఇంగ్లిషు భాషల్లో ప్రవాసాంధ్ర సాహిత్యం అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు టి.ఎల్.ఎన్ సభా మందిరంలో నిర్వహిస్తున్నారు. మార్చి 1,2 తేదీల్లో నిర్వహించే సదస్సు బ్రోచర్‌ను సోమవారం ఏయూ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు, సదస్సు కన్వీనర్ ఆచార్య ఏ.సీతారత్నం, సహ కన్వీనర్ ఆచార్య జె.విజయ భారతి, డాక్టర్ కె.రాజమాణిక్యం, ఆచార్య త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో 100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ స్కూలు పరిధిలో 100 పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున నోటిఫికేషన్ జారీ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఈ నియమకాలు చేపడుతున్నట్టు ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. క్యాన్సర్ కేర్ సంబంధించి విభాగాలను, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, యురాలజీ, నెఫ్రాలజీ విభాగాలను అన్ని ప్రభుత్వ వైద్య కళాశాల్లో ఏర్పాటు చేస్తున్న సంగతి విదితమే. దీని కోసం పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తులను ఈనెల 20వ సాయంత్రం 5 గంటల వరకు ఆంధ్ర వైద్య కళాశాల(విశాఖ) వారి కార్యాలయంలో సమర్పించాలి. www.visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్, ఆంధ్ర వైద్య కళాశాల అధికారిక వెబ్‌సైట్ www.amc.edu.in లో దరఖాస్తు చేసుకోవచ్చు.

విభిన్న ప్రతిభావంతులనుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లాలోని అంధ, బధిర, శారీరక విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్లు సహాయ సంచాలకులు తెలిపారు. డిగ్రీ, డిప్లమా, పాలిటెక్నిక్, పీజీ కోర్సులను చదువుతున్న వీరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 20 మందిని ఎంపిక చేసి ల్యాప్‌టాప్‌లను అందిస్తామన్నారు. అర్హత కలిగిన వారు తమ కళాశాల నుంచి ధ్రువపత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం (రూ.3 లక్షలలోపు), సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను జతచేయాలని సూచించారు. వీటిని పరిశీలించిన తరువాత సంయుక్త కలెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టల ఆమోదంతో వీటిని అర్హులకు అందిస్తామన్నారు. వీటితో పాటు అంధ అభ్యర్థులు అంధుల చేతికర్రలు, శారీరక విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిల్ అందిస్తామన్నారు.

విశాఖ వేదిక... క్రీడా వేడుక





వేడుకలకు ముస్తాబైన స్టేడియం

- నేడు 'ఆడుదాం-ఆంధ్రా' విజేతలకు బహుమతి ప్రదానం
- క్రికెట్ ఫైనల్స్ వీక్షించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- డా.వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో భారీ ఏర్పాట్లు

అందరూ ఆడాలి.. అందరికీ అవకాశమివ్వాలి.. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి.. గ్రామీణ స్థాయి క్రీడాకారులను సైతం ప్రోత్సహించాలి.. ఇదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశయం. అందుకే సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అంచలంచెలుగా పోటీలు నిర్వహించారు. గల్లీ స్థాయి ఆటగాళ్లు, వెటరన్ క్రీడాకారులు, చిన్నప్పుడెప్పుడో ఆటలాడిన గృహిణులు.. ఇలా ఎందరో ఈ క్రీడా యజ్ఞంలో పాలుపంచుకున్నారు. గ్రామ స్థాయిలో మొదలై, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలను పూర్తి చేసుకొని.. నాలుగు రోజులుగా రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫైనల్స్‌కు విశాఖ వేదికైంది. మంగళవారం విజేతలకు సీఎం చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరగనుంది. క్రికెట్ పోటీ ఫైనల్ మ్యాచ్‌ను ముఖ్యమంత్రి వీక్షించనుండడం ప్రత్యేక ఆకర్షణ.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్

విశాఖ స్పోర్ట్స్: 'ఆడుదాం-ఆంధ్రా' రాష్ట్రస్థాయి టోర్నమెంటు ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ రానున్న నేపథ్యంలో కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున ఏర్పాట్లను పరిశీలించారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్ తదితర అధికారులతో కలిసి సోమవారం పీఎం పాలెంలోని డా.వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముగింపు కార్యక్రమాన్ని పండగ వాతావరణం తలపించేలా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోందని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు, సాధారణ ప్రజలకు ఆహారం, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, శాప్ నుంచి ఒక్కొక్క ఇన్‌చార్జిని నియమిస్తున్నామని వెల్లడించారు. స్టేడియం లోపల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, వీక్షకులు వచ్చి కూర్చునేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. స్టేడియంలోపల ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు అనువుగా ప్రధాన స్టేజీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. స్టేడియం వద్ద సమావేశం అనంతరం జిల్లా అధికారులంతా మధురవాడ ఐటీ హిల్స్ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖలో రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లు జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు ఫైనల్ మ్యాచ్‌లో గెలిచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకునే అదృష్టం కలిగినందుకు చాలా సంతోషపడుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జోనల్ యువజన విభాగం ఇన్‌చార్జి శివ నందీష్ తదితరులు పాల్గొన్నారు.



ఖోఖోలో పోటీ పడుతున్న బాపట్ల,ప్రకాశం జిల్లాల జట్లు

భారీ బందోబస్తు

విశాఖ సిటీ: ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకల కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖకు వస్తున్న నేపథ్యంలో పోలీస్ శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం 1500 మందితో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటోంది. డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు బందోబస్తును పలు కేటగిరీలుగా విభజించి, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క పోలీసు ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించారు.



బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు



సీఎం జగన్ ప్రసంగించనున్న వేదిక వద్ద ఏర్పాట్లు

- ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజలకు, ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టారు.
- ఎయిర్‌పోర్ట్ వద్ద, పార్కింగ్, కాన్వాయ్, హెలిప్యాడ్, క్రికెట్ స్టేడియం వద్ద భద్రత చేపడుతున్న అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.
- నగరంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం ఏర్పడకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించారు.
- వీఐపీలు పాల్గొనే ప్రాంతాల్లో స్నిఫర్ డాగ్, బాంబు స్క్వాడ్లతో నిశితంగా తనిఖీలు చేశారు. ఏఎస్సీ, ఆర్‌టీపీలను నిర్వహిస్తూ సీఎం పర్యటించే రహదారులను పరిశీలించారు.
- ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనే ముఖ్యవ్యక్తుల వాహనాలకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే ఇతరుల వాహనాలకు వేరు వేరుగా పార్కింగ్ స్థలాలు కేటాయించారు.
- ఇప్పటికే సీపీ రవిశంకర్ సీఎం పర్యటించే ప్రాంతాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.
- అనంతరం ఆయన జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 మణికంఠ చందోలు, డీసీపీ (క్రైమ్) పి.వెంకటరత్నంలతో కలిసి ఈ బందోబస్తులో విధులు నిర్వహించనున్న అధికారులకు పలు సూచనలు చేశారు.

ఆధిక్యాన్ని ప్రదర్శించిన బాపట్ల

ఆడుదాం ఆంధ్ర టోర్నీలో బాపట్ల జిల్లా జట్లు ఆధికాన్ని ప్రదర్శించి విజేతగా నిలిచాయి. ఏలూరు, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు విశాఖ జట్టు ఒకో ట్రోఫీని సొంతం చేసుకున్నాయి. మెన్ వాలీబాల్‌లో మన్యం జిల్లా జట్టు, ఖోఖోలో అనకాపల్లి జిల్లా జట్టు రన్నరప్స్‌గా నిలిచింది. వుమెన్ కబడ్డీలో అనకాపల్లి జట్టు సెకండ్ రన్నరప్‌గా నిలిచింది. యాభై రోజుల పాటు సాగిన ఆడుదాం ఆంధ్ర తొలి సీజన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి.



కబడ్డీలో తలపడుతున్న వైజాగ్, అనంతపురం జట్లు

పంచగ్రామాల సమస్య పరిష్కారానికి కృషి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి , అదీప్‌రాజ్

మహారాణిపేట: పంచగ్రామాలు, సింహాచలం దేవస్థానం భూసమస్యలపై ప్రభుత్వం ఉదారంగా ఉందని, భూ అనుభవదారులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. సింహాచలం భూసమస్యలపై ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, భూ అనుభవదారులతో సమీక్షా సమావేశాన్ని ఉపముఖ్యమంత్రి సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పంచగ్రామాలు, సింహాచలం భూములకు సంబంధించిన భూ అనుభవదారుల సమస్యలను బాధితుల తరఫున ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారన్నారు. అయితే ఈ సమస్య ప్రభుత్వ పరిధిలో కాకుండా కోర్టులో పెండింగ్ ఉందనే విషయాన్ని స్థానికులకు వివరించామన్నారు. అయినప్పటికీ భూ అనుభవదారులకు ఎటువంటి నష్టం వాటిల్లకూడదనే ఈ వారంలోనే అడ్వకేట్ జనరల్‌తో చర్చించి కోర్టులో అఫిడవిట్ ఫైలు చేసి హియరింగ్ వచ్చేలా ప్రయత్నిస్తామని ఉపముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలతో పాతబడిన భవనాలకు ఆయా భవన యజమానులు మరమ్మతులను చేసుకునేలా అధికారులకు తగు సూచనలు చేశామన్నారు. ఈలోగా ఈ సమస్యను కోర్టు ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సింహాచలం దేవస్థానం భూ అనుభవదారుల సమస్య పెండింగ్‌లో ఉందని, దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి లబ్ధిదారులకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ పంచగ్రామాలు, సింహాచలం దేవస్థానం భూ సమస్యపై సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత, జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష, సింహాచలం దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, భూ అనుభవదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే రోజ్‌గార్ మేళా లక్ష్యం

తాటిచెట్లపాలెం: ఉపాధి పనుల్లో పారదర్శకత, రాజకీయ జోక్యానికి ఆస్కారం లేకుండా చేయడం, సిఫార్సుల నుంచి విముక్తి కల్పించడం నరేంద్రమోదీ ఆశయమని, దీనికోసమే రోజ్‌గార్ మేళాలను నిర్వహించి లక్షలాదిమందికి నియామక పత్రాలు ఇప్పటికే అందజేశారని మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నం సాలగ్రామపురంలోని పోర్టు సాగరమాల కన్వెన్షన్స్‌లో 12వ రోజ్‌గార్ మేళా ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం దేశవ్యాప్తంగా సుమారు లక్ష మందికి ఆయా ప్రాంతాల్లో నియామకపత్రాలు అందజేశామని, ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వివిధ విభాగాలలో ఉద్యోగాలు పొందిన సుమారు 197 మందికి నియామక పత్రాలు అందజేశారు. మినిస్ట్రీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్, మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ వంటి విభాగాల్లో అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు, డీఐజీ (సీఐఎస్ఎఫ్) మాతేటి నందన్, ప్రణీత్ చంద్ర(సీనియర్ కమాండెంట్, సీఐఎస్ఎఫ్), సతీష్ కుమార్ బాజ్‌పాయ్ (కమాండెంట్, సీఐఎస్ఎఫ్), టి.వేణుగోపాల్ (సెక్రటరీ, విశాఖపట్నం పోర్టు అథారిటీ) తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థికి నియామక పత్రాన్ని అందజేస్తున్న కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఎంపీ జీవీఎల్

నైపుణ్యాభివృద్ధిలో ఇంక్యుబేషన్ సెంటర్లది కీలకపాత్ర

తగరపువలస: నైపుణ్యాభివృద్ధిలో ఇంక్యుబేషన్ సెంటర్లది కీలకపాత్ర అని బీఎస్ఎన్ఎల్ విశాఖపట్నం ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ జి.ఆడమ్ అన్నారు. సోమవారం చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి బీఎస్ఎన్ఎల్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించి కళాశాల యాజమాన్యంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇది దేశంలోనే రెండో అతి పెద్ద ఇంక్యుబేషన్ సెంటర్ అని తెలిపారు. మెరుగైన ప్లేస్‌మెంట్, ప్రయోగాత్మక శిక్షణ కోసం ఈ ఇంక్యుబేషన్ సెంటర్‌ను వినియోగించాలన్నారు. డీజీఎం ఎం.సత్యప్రసాద్ మాట్లాడుతూ భారతదేశం ప్రస్తుతం టీసీఎస్, సీడీఏసీ ఉపయోగించి మొబైల్ విడిభాగాలను సిద్ధం చేస్తుందన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలన్నారు. ఏజీఎం బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టార్టప్‌లకు, విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ఈ ఇంక్యుబేషన్ సెంటర్ దోహదపడుతుందన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యం కలిగి ఉన్న తమ విద్యార్థులు సొంతంగా స్టార్టప్‌లు ప్రారంభించడానికి, ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పొందడానికి ఈ అవకాశం దోహదపడుతుందన్నారు. పారిశ్రామిక అవసరాలపై విద్యార్థులకు అవగాహన పెంచేందుకు గాను విద్యార్థులకు పారిశ్రామిక సందర్శన ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఫార్మసిస్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫార్మసిస్టుల గ్రేడ్-2 నియామకాలకు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ బి.సుజాత (విశాఖ,జోన్) నోటిఫికేషన్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి ,విశాఖ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 8 ఫార్మాసిస్టు గ్రేడ్-2 పోస్టులు భర్తీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ నెల 27వ తేదీ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఆమె తెలిపారు. వివరాల కోసం https@//nagendrasvast. wordpress. com వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.500, మిగిలిన కులాలకు చెందిన అభ్యర్థులు రూ.300,డిమాండ్ డ్రాఫ్ట్ తీసి దరఖాస్తుకు జత చేయాలన్నారు.

మత్తు వదిలిస్తాం..

- గంజాయి తదితర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం
- పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదుల పరిష్కారానికి కృషి
- విశాఖ రేంజ్ నూతన డీఐజీ విశాల్ గున్ని



డీఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న విశాల్ గున్ని

సాక్షి, విశాఖపట్నం: నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్)పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, దానికి అనుగుణంగానే తమ పనితీరు ఉంటుందని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని చెప్పారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని, అక్రమ రవాణాను నిర్మూలిస్తామని, ఏజెన్సీ ప్రాంత జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రేంజ్ పరిధిలోని 5 జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేంజ్ పరిధిలోని గల వివిధ జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి తమ శాఖలోని అన్ని విభాగాలను పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదు ఇచ్చిన వారందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకు వెళతామన్నారు. తాను అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, వార్తలు ప్రచురించే ముందు తనను లేదా ఎస్పీ స్థాయి అధికారులను సంప్రదించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు. సోషల్ మీడియాలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అవాస్తవాలను వార్తలుగా ప్రచురించడం రోజురోజుకు పెరుగుతోందని, ఈ కారణంగా ప్రజలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వార్త ప్రచురించే ముందు నిజనిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

వైవీ సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు



వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, నియోజకవర్గ నేతలు

సీతమ్మధార: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని సోమవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ అభ్యర్థిగా సుబ్బారెడ్డి నామినేషన్ వేసిన సందర్భంగా కె.కె.రాజు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, కిరణ్ రాజు, శైలేష్ పాల్గొన్నారు.

14న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14 నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

భీమిలిలో అత్యధికం.. పశ్చిమలో అత్యల్పం

- సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు చురుగ్గా అడుగులు
- జిల్లాలో అదనంగా 27 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు
- 31 కేంద్రాలు తొలగించిన ఎన్నికల కమిషన్
- 1000 ఓటర్లు దాటిన స్టేషన్లు 443
- ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోనే కౌంటింగ్ కేంద్రాలు
- నియోజకవర్గానికి 2 చొప్పున కౌంటింగ్‌కు మొత్తం 14 గదులు గుర్తింపు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా, కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిన అధికారులు.. పోలింగ్ ఏర్పాట్లపై దృష్టిసారించారు. ఇప్పటికే పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ(రేషనలైజేషన్) పూర్తి చేశారు. జిల్లాలో గతంలో 1945 పోలింగ్ కేంద్రాలుండగా.. రేషనలైజేషన్ తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికలకు 1941 పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. భీమిలి నియోజకవర్గంలో అత్యధికంగా.. విశాఖ పశ్చిమంలో అత్యల్పంగా కేంద్రాలున్నాయి. ఈసారి కూడా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోనే కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు షురూ చేసింది.

2019 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అడ్డగోలుగా నకిలీ ఓటర్లని చేర్పించి.. అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నించింది. అయితే ఈసారి ఎన్నికల్లో అలాంటి తప్పులు దొర్లకుండా.. ప్రతి ఓటునీ ఎన్నికల కమిషన్ విభిన్న దశల్లో పరిశీలన చేసి సమగ్రంగా తుది ముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్ కూడా పూర్తి చేసింది. 2019 ఎన్నికల ప్రకారం జిల్లాలో 1945 పోలింగ్ కేంద్రాలున్నాయి. రేషనలైజేషన్ తర్వాత అదనంగా 27 పోలింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. అయితే.. 212 పోలింగ్ కేంద్రాల్లో చిరునామా మార్పిడి, 157 కేంద్రాల్లో పేరు మార్పులు చేపట్టారు. భవనాలు పాడైనా, సౌకర్యాలు లేకపోయినా పోలింగ్ స్టేషన్ల లొకేషన్లు మార్పులు చేశారు. 2 కిలోమీటర్ల దూరం మించితే కొత్త కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా తీసుకున్న ఓటర్ల జాబితా ప్రకారం 31 కేంద్రాలను తొలగించారు. ఈ విధంగా రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత మొత్తం 1941 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లుగా ఎన్నికల అధికారులు నిర్ధారించారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం పోలింగ్ స్టేషన్‌లో ఉండాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

భీమిలిలో అత్యధికంగా..

జిల్లాలో పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధించి నియోజకవర్గాల్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. నివేదికలకు అనుగుణంగా జిల్లాలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియపైనా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష చేసిన అనంతరం పోలింగ్ కేంద్రాలు గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశారు. కొత్తగా వచ్చిన కేంద్రాలతో పోలిస్తే.. అత్యధిక ఓటర్లున్న భీమిలి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల విషయంలోనూ అగ్రభాగంలో ఉంది. భీమిలిలో మొత్తం 348 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. విశాఖ పశ్చిమలో అత్యల్పంగా 220 కేంద్రాలు గుర్తించారు. 1000కి పైగా ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 443 ఉన్నాయి.

ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోనే కౌంటింగ్

పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్‌తో పాటు అవసరమైన ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు ఇతరత్రా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఆరుగురు సిబ్బందిని కేటాయించారు. పోలింగ్, కౌంటింగ్‌కు అవసరమైన అన్ని కేటగిరీల సిబ్బందిని సిద్ధం చేశారు. రిజర్వ్ సిబ్బందితో కలిపి 1,000 మంది అదనంగా అవసరం కావడంతో వారిని కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎప్పటిలాగానే కౌంటింగ్ కేంద్రంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేశారు. ఒక్కో నియోజకవర్గానికి రెండు గదులు చొప్పున ఏయూ ఇంజినీరింగ్ కాలేజీలో 14 గదులను కౌంటింగ్ కోసం కేటాయించారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ స్టేషన్ల వివరాలు

నియోజకవర్గం	ప్రస్తుతం ఉన్న పోలింగ్‌స్టేషన్లు	లొకేషన్ మార్పు చేసిన స్టేషన్లు	పేర్లు మార్పు చేసిన స్టేషన్లు	ఏర్పాటైన కొత్త స్టేషన్లు	తొలగించిన స్టేషన్లు	తుది పోలింగ్ స్టేషన్లు
భీమిలి	335	41	39	13	00	348
విశాఖ తూర్పు	282	16	03	00	00	282
విశాఖ దక్షిణ	235	03	00	00	00	235
విశాఖ ఉత్తర	271	17	05	01	00	272
విశాఖ పశ్చిమ	237	18	23	04	21	220
గాజువాక	305	85	87	07	10	302
పెందుర్తి	280	32	00	02	00	282
మొత్తం	1945	212	157	27	31	1941

పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌ల ఏర్పాటు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఆదేశం

సాక్షి, విశాఖపట్నం: ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ దివ్యాంగులకు సౌకర్యవంతంగా ర్యాంప్‌లు ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. విశాఖ పర్యటనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం నగరంలోని పలు పోలింగ్ స్టేషన్లలో తనిఖీలు చేశారు. పోలింగ్ బూత్‌లను నిశితంగా పరిశీలించి.. వాటి వివరాలను కలెక్టర్ డా.మల్లికార్జునను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో కల్పించిన వసతులపై ఆరా తీశారు. అన్ని చోట్లా దివ్యాంగులు సులభంగా కేంద్రం లోపలకు చేరుకునేందుకు ర్యాంపులు ఉండాలని స్పష్టం చేశారు. ఓటర్లకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల, రెవెన్యూ అధికారులు, బీఎల్వోలు తదితరులున్నారు. అంతకుముందు ఏయూ కెమికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో నిర్వహించిన ఎన్నికల అధికారులు, సిబ్బంది శిక్షణ తరగతుల్లో ముకేష్‌కుమార్ మీనా పాల్గొన్నారు.

షాపులు, ఖాళీ స్థలాల లీజుకు 22న బహిరంగ వేలం

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏకు సంబంధించిన వాణిజ్య సముదాయాలు, షాపులు, ఆడిటోరియాలు, ఆఫీస్‌లు, ఇతర ఖాళీ స్థలాలను నెలసరి/సంవత్సర అద్దె చెల్లింపు ప్రతిపాదికన లీజులకు ఇచ్చేందుకు బహిరంగ వేలం, టెండర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కీర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు విస్తీర్ణం, అద్దె, సంస్థ అప్‌సెట్ ధర వంటి వివరాలు http://www.vmrda.gov.in/ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. ఈ షాపులు, వాణిజ్య సముదాయాలు యథాతథంగా మూడేళ్ల కాల పరిమితి కోసం నెలసరి/సంవత్సర అద్దెకు వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు వీఎంఆర్డీఏ వెబ్‌సైట్‌లో గానీ, సంస్థ కార్యాలయం 8వ అంతస్తు రెవెన్యూ విభాగంలో గానీ దరఖాస్తులు పొందవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(వుడా బ్రాంచ్) సిరిపురంలో దరఖాస్తు రుసుం ఒక్కటికి రూ.2 వేలు చలానా రూపంలో చెల్లించాలని, దరఖాస్తు సొమ్ము(ఈఎండీ) ఒక్కోటికీ రూ.20 వేలు దిమెట్రోపాలిటన్ కమిషనర్, వీఎంఆర్డీఏ, విశాఖపట్నం పేరున డీడీ తీసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు, చలానా, డీడీలు వీఎంఆర్డీఏ కార్యాలయంలోని 8వ అంతస్తులో 13వ తేదీ నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ కేటగిరీ వారు కులం, సంబంధిత ధ్రువీకరణపత్రాలు జతపరచాలన్నారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో బహిరంగ వేలం జరుగుతుందని వెల్లడించారు.

అంతర్జాతీయ వర్సిటీలకు దీటుగా ఏయూ

ఎన్‌వోఏఏ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ విజయ్



డాక్టర్ విజయ్‌ని సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సోమవారం ఏయూ పూర్వ విద్యార్థి, అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్‌వోఏఏ) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ విజయ్ తల్లా ప్రగడ సందర్శించారు. ముందుగా తాను చదువుకున్న ఏయూ వాతావరణ శాస్త్ర విభాగాన్ని సందర్శించి, అక్కడ ఆచార్యులతో కొద్దిసేపు సంభాషించారు. ఏయూ వాతావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న పరిశోధనలు, వసతులు పరిశీలించారు. అనంతరం వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విజయ్ తల్లాప్రగడ మాట్లాడుతూ అమెరికాలోని అత్యున్నత విశ్వవిద్యాలయాలైన ఎంఐటీ, హార్వర్డ్ వర్సిటీల తరహాలో ఏయూ అభివృద్ధి సాధిస్తోందన్నారు. తన విజయానికి బలమైన పునాదులు ఇక్కడే పడ్డాయని, వర్సిటీకి తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. అనంతరం వర్సిటీ తరఫున అతన్ని వీసీ ప్రసాదరెడ్డి సత్కరించారు. పాలకమండలి సభ్యులు, ఏయూ వాతావరణశాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.సునీత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలకు సత్వర పరిష్కారం

జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం(జేకేసీ)లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసీ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో సోమవారం ఆయన వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి 286 వినతులు స్వీకరించారు. అర్జీదారుడు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. డీఎల్‌డీవో పూర్ణిమా దేవి, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మాధవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు 96 వినతులు



జీవీఎంసీలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఏడీసీ విశ్వనాథన్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన జగనన్నకు చెబుదాంకు 96 వినతులు అందాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, అదనపు కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ ఫిర్యాదులు స్వీకరించారు. అలాగే డయల్ యువర్ మేయర్‌కు 13 ఫిర్యాదులు వచ్చాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి.. తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 5, టౌన్ ప్లానింగ్‌కు 2, ప్రజారోగ్య విభాగానికి ఒకటి, మొక్కల విభాగానికి ఒకటి, యూసీడీ పీడీ విభాగానికి 4 కాల్స్ వచ్చాయి. అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణంరాజు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, ఇన్‌చార్జి డీడీహెచ్ చక్రవర్తి, ఏసీపీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలతోనే రాణింపు

అనకాపల్లి అదనపు ఎస్పీ విజయభాస్కర్



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్

ఆరిలోవ: పోలీసులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని అనకాపల్లి అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్ సూచించారు. విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో సోమవారం సాయుధ బలగాల వార్షిక సమీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. అనంతరం అదనపు ఎస్పీ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలకు పోలీసులు సిద్ధం కావాలన్నారు. మానసికంగా చురుకుగా ఉండి.. ఎలాంటి అవరోధాలనైనా సమర్థవంతంగా అధిగమించాలన్నారు. ఏఆర్ విభాగం జిల్లాల్లో కీలక సేవలు అందిస్తోందన్నారు. అత్యాధునిక ఆయుధాల నిర్వహణ, వాటి ఉపయోగం, ఫైరింగ్, డ్రిల్, మార్చ్‌పాస్ట్, మాబ్ కంట్రోల్, వీఐపీ ఎస్కార్ట్, బందోబస్తు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అల్లూరి జిల్లా అదనపు ఎస్పీ సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు సతీష్, అరవింద్ కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటరితనంతో మనస్తాపం

వివాహిత బలవన్మరణం

మల్కాపురం: భర్త, పిల్లలు లేరన్న మనస్తాపంతో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ సమీపంలోని అంబేడ్కర్‌కాలనీలో కంకిపాడు ఝాన్సీ (32) నివాసం ఉంటోంది. పిల్లలు లేకపోవడంతో కొంతకాలంగా తీవ్ర ఆవేదనతో ఉంది. ఇటీవలే ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. ఒంటరిగా ఇంట్లో దిగాలుగా ఉండేది. ఈ క్రమంలో సోమవారం ఉదయం బాత్‌రూమ్‌లో హుక్కుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సమయం తర్వాత ఝాన్సీ ఇంటికి వచ్చిన బంధువులు.. ఆమెను పిలిచారు. ఎంతకీ స్పందన లేకపోవడంతో గదిలో వెతికారు. గడియపెట్టి ఉన్న బాత్‌రూమ్ డోర్ కొట్టారు. ఫలితం లేకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని.. బాత్‌రూమ్ తెరిచి చూశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మనస్తాపమే ఆమె మృతికి కారణమని పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బ్యాంక్‌ను మోసగించిన ఇద్దరికి జైలు

విశాఖ లీగల్: బ్యాంక్‌ను మోసగించిన ఇద్దరు వ్యక్తులకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.22వేల జరిమానా విధిస్తూ నగరంలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం–1 న్యాయమూర్తి సీఎస్‌మూర్తి సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. వివరాలివీ.. మొదటి నిందితుడు సత్య శివరామ శర్మ రాజమహేంద్రవరం గ్రామీణంలోని ధవళేశ్వరం సిండికేట్ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేసేవాడు. మూడవ నిందితుడు మెండ వెంకట రమణమూర్తి ధవళేశ్వరంలోని స్వర్ణాంధ్ర పేపర్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమానిగా ఉన్నారు. ఐదవ నిందితుడు చిన్నిమల్లి సూర్య ప్రభాకర్‌రావు రాజమండ్రి సమీపంలోని కొంతమూరులో శ్రీ సాయి పేపర్ ఎక్యూప్‌మెంట్ అండ్ స్పేర్స్ యజమాని. 2012–2013 ప్రాంతంలో నిందితులందరూ ఏకమై 30 టీపీడీ మోడల్ మిషన్ కొనుగోలుకు బ్యాంక్ రుణం కోసం సిండికేట్ బ్యాంక్‌ను ఆశ్రయించారు. తమకు 9 కోట్ల 88 లక్షల 12 వేల 136 రూపాయలు కావాలని బ్యాంక్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, ఆడిట్ రిపోర్టులను బ్యాంక్‌కి సమర్పించారు. నివేదికలను సమగ్రంగా పరిశీలించకుండా అప్పటి బ్యాంక్ సీనియర్ మేనేజర్ శర్మ వీరికి రుణాలు మంజూరు చేశారు. దీంతో వారు రూ.6 కోట్ల వరకు రుణాలు పొందారు. తర్వాత బ్యాంక్ పైఅధికారులకు అనుమానం రావడంతో నిందితులు, వారి కంపెనీలకు సంబంధించిన వివరాలను సేకరించారు. అన్నీ నకిలీవి అని తేలడంతో బ్యాంక్ మేనేజర్‌తో పాటు కంపెనీ యజమానులపై కేసు నమోదు చేశారు. నిందితులపై ఐపీసీ 420, 120 బీ, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 బీ, సెక్షన్లపై కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో ఉండగా మొదటి నిందితుడు శర్మ 2019 మేలో మృతి చెందారు. కీలకమైన నిందితులు వెంకట రమణమూర్తి, సూర్య ప్రభాకర్ రావులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు. ఎ–2 ఆస్తి మదింపు చేసిన వ్యక్తి, ఏ–4 ఆడిటర్ నిర్దోషులుగా తేలారు. బ్యాంక్‌లను మోసగించినా.. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో లంచం తీసుకున్నా.. అవినీతికి పాల్పడిన వారికి సంబంధించి తమకు తెలియజేయాలని సీబీఐ అధికారులు ఓ ప్రకటనలో సూచించారు.

కాశీ రైలు దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ సెంట్రల్ రైల్వే పరిధి అన్‌కోరా–సోన్ నగర్ మధ్య 3వ లైన్ సంబంధిత ప్రీ/నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా.. ఈ మార్గంలో ప్రయాణించే విశాఖ–బనారస్–విశాఖ రైలును దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఈ నెల 14, 18, 21 తేదీల్లో బయలుదేరే విశాఖ–బనారస్(18311) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 15, 19, 22వ తేదీల్లో బయలుదేరే బనారస్–విశాఖ(18312) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ బర్కకానా–గార్వా రోడ్–డెహ్రీ ఆన్‌సోన్–పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గంలో ప్రయాణించదు. మళ్లించిన మార్గంలో వయా బర్కకానా–హజారీబాగ్ టౌన్–కోడెర్మా–గయ– పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

విశాఖ–తిరుపతి రీ షెడ్యూల్ : విశాఖపట్నం–తిరుపతి(08583) స్పెషల్ ఆలస్యంగా సోమవారం రాత్రి 10.10 గంటలకు బయలుదేరింది. ఈ రైలు రాత్రి 7.10 గంటలకు బయలుదేరాల్సి ఉండగా.. పెయిరింగ్ రైలు రాక ఆలస్యమైంది.

హెచ్ఎస్ఎల్‌లో వీఎల్‌టీ ప్యానెల్ పునరుద్ధరణ

బీచ్‌రోడ్డు: జాతీయ ఉత్పాదకత దినోత్సవం సందర్భంగా హిందూస్థాన్ షిప్‌యార్డ్(హెచ్ఎస్ఎల్)లో 30 ఏళ్ల నాటి 440 వీఎల్‌టీ ప్యానెల్‌ను పునరుద్ధరించారు. యార్డ్ ఆధునీకీకరణ ప్రణాళికలో భాగంగా సోమవారం షిప్‌యార్డ్ సీఎండీ కమోడోర్ హేమంత్ ఖత్రి దీనిని ప్రారంభించారు. ఈ ప్యానెల్ ద్వారా ఉత్పత్తిలో అంతరాయం లేకుండా చేయవచ్చని ఆయన తెలిపారు. ప్యానెల్ పునరుద్ధరించడం ద్వారా హెచ్‌సీఎల్ ఉద్యోగుల్లో విశ్వాసం పెరిగిందన్నారు.

అంబేడ్కర్ పత్రిక 'మూక్‌నాయక్'కు 104 ఏళ్లు

అల్లిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రారంభించిన మూక్ నాయక్ పత్రిక 104 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దళిత మీడియా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా యూపీఎస్సీ మాజీ సభ్యుడు, ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కె.ఎస్.చలం మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో బహుజనులకు తగిన ప్రాతినిధ్యం, హక్కుల పరిరక్షణకు అంబేడ్కర్ మూక్ నాయక్ పత్రికను ప్రారంభించారన్నారు. రాజకీయవేత్తగా, న్యాయకోవిదుడిగా, కార్యనిర్వహణ నిపుణుడిగా మాత్రమే కాకుండా గొప్ప పాత్రికేయుడి పాత్ర పోషించారన్నారు. దేశంలో కుల వ్యవస్థ నిర్మూలనలో మీడియా పాత్ర ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు. అంతకుముందు ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐడీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నానాజీ సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

వైజాగ్ ఐడల్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

తాటిచెట్లపాలెం: వివిధ రంగాల్లో యువతను ప్రోత్సహించడానికి వైజాగ్ ఐడల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తెలిపారు. సాలగ్రామపురంలోని పోర్టు సాగరమాల కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఆవిష్కరించారు. వైజాగ్ ఐడల్‌లో భాగంగా సింగింగ్, భారతీయ సంప్రదాయ నృత్యాలు, పాశ్చాత్య సంగీత విభాగం, ప్రత్యేక ప్రతిభ (మ్యూజిక్, మిమిక్రీ, మ్యాజిక్, ఆర్ట్స్), బాక్స్ క్రికెట్ ఇలా పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 8–17, 18–25 సంవత్సరాల వారికి వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, ఈవెంట్ నిర్వాహకుడు వీరుమామా పాల్గొన్నారు.